క్లుప్తంగా

హిందూస్థాన్ స్కౌట్స్, గైడ్స్ జిల్లా ఉపాధ్యక్షుడిగా అంబటి


అంబటి శ్రీనివాసరావు

నల్లజర్ల: హిందుస్థాన్ స్కౌట్స్, గైడ్స్ జిల్లా ఉపాధ్యక్షుడిగా దూబచర్ల గ్రామంలోని సంఘమిత్రా విద్యాలయం స్కూల్ డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావును నామినేట్ చేసినట్లు స్టేట్ ఆర్గనైజేషన్ కమిషనర్ ఇ.కోటేశ్వరరావు, స్టేట్ జాయింట్ సెక్రటరీ ఎస్.రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్కౌట్స్, గైడ్స్ లక్ష్యాలకు అనుగుణంగా తన వంతు సహకారం అందిస్తానన్నారు. శ్రీనివాసరావు నియామకంపై లయన్స్ క్లబ్ దూబచర్ల శాఖ అధ్యక్షుడు కెల్లా వాసు, దూబచర్ల సర్పంచ్ తాడిగడప బాలయ్య, ఉప సర్పంచ్ కాసాని బాలగంగాధర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

టౌన్ చర్చిలో ఘనంగా యూత్ సండే


చర్చి చైర్ పర్సన్ మెంటే దయారాజగిరిని సత్కరిస్తున్న యువజనులు

నిడదవోలు: స్థానిక రాయిపేటలోని మెంటే సుందరరావు మెమోరియల్ టౌన్ లూథరన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ కె.కమలాకర్ అధ్యక్షతన ఘనంగా యూత్ సండే నిర్వహించారు. యవ్వనస్తులు సంఘ ఆరాధన, ప్రార్థన, క్రీస్తు సువార్త గీతాలు ఆలపించారు. జి.దినేష్ వాక్య పరిచర్య చేశారు. అనంతరం ఆ చర్చి చైర్ పర్సన్ మెంటే దయారాజగిరిని యవ్వనస్తులు సత్కరించారు. కార్యక్రమంలో కె. షర్మిలాప్రియమౌని, స్రవంతి, జస్వని, గిరి రేంతమ్, విజ్ఞత్, నిస్సీ, డింపుల్, షైనీ, గౌతమ్, తేజ, నీరజ్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

గణనాథునికి మాజీ ఎమ్మెల్యే పూజలు


శాంతినగర్ మంటపంలో గణనాథునికి పూజలు చేస్తున్న శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: పట్టణంలోని 24వ వార్డు శాంతినగర్‌లో ప్రతిష్ఠించిన గణనాథునికి మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించారు. అక్కడ నుంచి శ్రీనివాస్‌నాయుడు స్థానిక ఒకటో వార్డు బాలాజీనగర్‌కు చేరుకుని ఇక్కడి గణపతి శిబిరంలో నిర్వహించిన అన్న సమారాధనలో పాల్గొన్నారు. కౌన్సిలర్లు పువ్వల రతీదేవి, ఆకుల ముకుందరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, నాయకులు గాజుల రంగారావు, తోలేటి కోటేశ్వరరావు, గుర్రం జేమ్స్, ఆలమూరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మీనానగరంలో డ్రైన్‌కు భూమి పూజ

చాగల్లు: చాగల్లు శివారు మీనానగరం గ్రామంలో డ్రైన్ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. మండల పరిషత్ నిధులు రూ.14.50 లక్షల వ్యయంతో గ్రామంలోని మెయిన్ రోడ్డును చేర్చి నిర్మించే ఈ డ్రైన్‌కు ఎంపీపీ మట్టా వీరాస్వామి భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, తెలుగు యువత రాష్ట్ర నాయకుడు నాదెళ్ల శ్రీరామ్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కరుటూరి సతీష్, ఉప సర్పంచ్ మేకా రాజు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

నేడు,రేపు యర్నగూడెంలో ఉచిత మెగా వైద్యశిబిరం

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెంలోని ఆర్.కన్వెన్షన్ కల్యాణ మంటపంలో ఈ నెల 16,17 తేదీల్లో ఉచిత వైద్య మెగా శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు పెన్మత్స సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరానికి హాజరయ్యే రాజమహేంద్రవరం జీఎస్ఎల్ ఆసుపత్రి వైద్యులు రోగులకు అన్నిరకాల వైద్య పరీక్షలూ నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామని వివరించారు. స్కానింగ్, క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. అలాగే శిబిరం వద్ద ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. యర్నగూడెం బస్టాండ్ నుంచి మెడికల్ శిబిరం వద్దకు రావడానికి ఆటో సదుపాయం కల్పించినట్టు సుబ్బారావు తెలిపారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులకు దుస్తుల పంపిణీ

గోపాలపురం: మండలంలోని సాగిపాడు లెప్రసీ కాలనీ వాసులకు ఆదివారం మండల మానవత సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. అత్తిలి నాగేశ్వరరావు, ఈలి శరత్‌బాబు అనే దాతల ఆర్థిక సహకారంతో 25 మందికి దుస్తులు పంపిణీ చేసినట్టు మండల మానవత సంస్థ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంస్థ సభ్యులు గెడ జోగేంద్రప్రసాద్, నల్లి చంద్రశేఖర్, గుబ్బా లక్ష్మణరావు, కె.కీర్తికుమార్, కొయ్య నాగరాజు పాల్గొన్నారు.


కొవ్వూరు మెరకవీధిలో ప్రత్యేకంగా అలంకరించిన రథంపై గణనాథుని ఊరేగింపు


నిడదవోలు ప్రధాన కాలువలో నిమజ్జనానికి ట్రాక్టర్ పైనుంచి భారీ గణేశ్ విగ్రహాన్ని దింపుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు


ఉండ్రాజవరం మండలం తాడిపర్రు గ్రామంలో ప్రత్యేక వాహనంలో ఊరేగుతున్న వినాయకుడు


దేవరపల్లిలో గణపతి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఊరేగిస్తున్న భక్తులు

బై బై..గణేశా..

- కోలాహలంగా గణనాథుని నిమజ్జనాలు
- ఊరూవాడా సందడే సందడి
- నిడదవోలు రేవు వద్ద ఏర్పాట్లలో యంత్రాంగం విఫలం
- క్రేన్ తెచ్చారు..తాళ్లు మరిచారు
- భుజాలపై విగ్రహాలను మోసుకుంటూ యువత నిమజ్జనం

కొవ్వూరు: ఊరూ వాడా ఒక్కటే సందడి. ఎక్కడ చూసినా వినాయక విగ్రహాల ఊరేగింపులతో ఆదివారం వీధులన్నీ కళకళలాడాయి. నవరాత్రులు పూజలందుకున్న లంబోదరుడు గంగమ్మ ఒడిలో చేరేందుకు పయనమయ్యాడు. నిమజ్జనోత్సవాల్లో భాగంగా ప్రత్యేకంగా అలంకరించిన రథాలపై గణనాథులు కొలువుదీరారు. మేళతాళాలు, డప్పు డ్యాన్స్‌లు, తీన్‌మార్ నృత్యాలతో భక్తులు గణనాథుడ్ని వీధుల్లో ఊరేగించారు. కొవ్వూరులోని మెరక వీధి వినాయకుడి గుడి వద్ద, నందమూరులోను, పాతపేట రామాలయం వద్ద ఆదివారం భారీఎత్తున అన్న సమారాధనలు నిర్వహించారు.

భక్తులు రంగులు చల్లుకుంటూ 'బోలో గణేశ్ మహారాజ్‌కీ జై' అంటూ, 'జై గణేశ్' అంటూ నినాదాలు చేశారు. కొవ్వూరు, చాగల్లు, దేవరపల్లి, తాళ్లపూడి మండలాల్లోని పలు విగ్రహాలు ఊరేగింపు అనంతరం స్థానిక గోష్పాద క్షేత్రంలో నిమజ్జనానికి తరలించారు. ఆదివారం రాత్రి పొద్దుపోయేంత వరకూ ఊరేగింపులు కొనసాగుతూనే ఉన్నాయి. కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్, పట్టణ సీఐ పి.విశ్వం ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ ప్రధాన కూడళ్లలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గోష్పాద క్షేత్రంలో ఏర్పాటు చేసిన భారీ క్రేన్ సాయంతో గణనాథుడి విగ్రహాలను గోదావరి నదిలో నిమజ్జనం చేస్తున్నారు.

నిడదవోలు: గణేశ్ విగ్రహాల నిమజ్జనోత్సవాలతో పట్టణంలోని పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ రేవు వద్ద ఆదివారం కోలాహలం నెలకొంది. పట్టణంలోని వివిధ సెంటర్లలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలు యువత కేరింతలు, డప్పు వాయిద్యాలు, డీజే సౌండ్స్ మధ్య వాహనాలపై ఊరేగింపుగా సాయంత్రం నాలుగు గంటలకు ఇక్కడికి చేరుకున్నాయి. నిమజ్జనానికి మాత్రం చాలా ఆలస్యమైంది. రేవులో తగిన ఏర్పాట్లు చేయడంలో పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు విఫలం కావడంతో ఉత్సవ కమిటీల నిర్వాహకులు నానా అవస్థలూ పడ్డారు. ప్రధాన కాలువ 6,000 క్యూసెక్కులతో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏమాత్రం అజాగ్రత్త వహించినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. రేవు వద్ద రోప్ ఏర్పాటు చేయలేదు. పోలీసులు, ఫైర్ సిబ్బంది కాలువ రేవు వద్ద ఉన్నారే తప్ప ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. పట్టణంలోని వివిధ సెంటర్లలో ఏర్పాటు చేసిన సుమారు 20 విగ్రహాలను కాలువలో నిమజ్జనం చేశారు. భారీ విగ్రహాలను క్రేన్ సాయంతో కాలువలోకి దింపే పరిస్థితి ఇక్కడ లేదు. ప్రతి మంటపం వద్దా వినాయక విగ్రహం ఏర్పాటుకు చలానాల రూపంలో పోలీసులు చలానాల రూపంలో సొమ్ము వసూలు చేశారే తప్ప అందుకు తగిన ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారనే విమర్శలు వచ్చాయి. క్రేన్ తీసుకొచ్చారు. కానీ భారీ విగ్రహాలకు కట్టే తాడు ఏర్పాటు చేయలేదు. దాంతో క్రేన్ ఉన్నా ఉపయోగించలేదు. ఆయా ఉత్సవ కమిటీల నిర్వాహకులే తాడు తెచ్చుకోవాలని పోలీసులు సూచించడాన్ని బట్టి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. దాంతో యువకులు వాహనాల పైనుంచి విగ్రహాలను భుజాలపై మోసుకుంటూ కిందికి దించారు. అక్కడి నుంచి కాలువలో నిమజ్జనం చేయడానికి వారు నానా అవస్థలూ పడ్డారు. ఇదే కాలువ రేవులో నిమజ్జనం చేస్తుండగా ఈనెల 10వ తేదీ రాత్రి చాగల్లు మండలం బ్రాహ్మణగూడేనికి చెందిన పేడాడ రాజేష్ (22) అనే యువకుడు గల్లంతై మృతి చెందిన విషయం తెలిసిందే. ఇప్పటికైనా నిమజ్జనం చేసే కాలువ రేవుల వద్ద గజ ఈతగాళ్లు, రోప్ వంటి రక్షణ చర్యలు చేపట్టి భారీ విగ్రహాలను క్రేన్ సాయంతో నిమజ్జనం చేసేలా ఏర్పాటు చేయాలని ఆయా ఉత్సవ కమిటీల సభ్యులు కోరుతున్నాయి.


గోపాలపురం మండలం వాదాలకుంటలో గణేశ్ మహరాజ్ ఊరేగింపు

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెంలో ప్రత్యేకంగా అలంకరించిన పూల రథంపై స్వామి వారిని ఉంచి కోలాహలంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. దేవరపల్లిలో యూనియన్ బ్యాంకు వీధిలో ప్రతిష్ఠించిన స్వామి వారి విగ్రహాన్ని ఊరేగించారు. ఊరేగింపులతో గ్రామాల్లో సందడి ఏర్పడింది.


కొవ్వూరులో ఆదివారం రాత్రి గోదావరి నదిలో క్రేన్ సాయంతో భారీ గణనాథుని విగ్రహం నిమజ్జనం

తాళ్లపూడి మండలంలో..

తాళ్లపూడి: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాల నిమజ్జనాలను ఆదివారం కోలాహలంగా నిర్వహించారు. డీజే సౌండ్, తీన్‌మార్ నృత్యాలతో విగ్రహాలను కమిటీ సభ్యులు గ్రామాల్లో ఊరేగించారు. వేగేశ్వరపురం, ప్రక్కిలంక, తాళ్లపూడి, గజ్జరం, పెద్దేవం, అన్నదేవరపేట తదితర గ్రామాల్లో ప్రతిష్ఠించిన విగ్రహాలను ట్రాక్టర్లు, ఇతర వాహనాలపై ఊరేగించి గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. వినాయక నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా తాళ్లపూడి బస్టాండు సెంటర్ వద్ద గణపతి యువజన సంఘం ఆధ్వర్యంలోను, వేగేశ్వరపురంలోని అంబటి వారి వీధిలోను అన్నసమాధనలు చేశారు. సుమారు 3 వేల మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

నాలుగు గ్రామాల నుంచి 20 విగ్రహాలు

గోపాలపురం: మండలంలోని వాదాలకుంట, వెదుళ్లకుంట, వేళ్లచింతలగూడెం, చిట్యాల గ్రామాల నుంచి సుమారు 20 గణేశ్ విగ్రహాలను నిమజ్జనం నిమిత్తం ఆదివారం తాళ్లపూడి వద్ద గోదావరి నదికి తరలించారు. గ్రామాల్లో గణేశ్ మహరాజు విగ్రహాలను ఊరేగించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నిడదవోలు రూరల్: వివిధ గణపతి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం వినాయక విగ్రహాలను ఘనంగా నిమజ్జనం చేశారు. మండలంలోని తాడిమళ్ల, సమిశ్రగూడెం, డి.ముప్పవరం గ్రామాల్లో నిర్వహించిన గణేశ్ నిమజ్జన కార్యక్రమాల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బుట్టబొమ్మలు, తీన్‌మార్ డప్పులు, యువకుల నృత్యాలతో పల్లెలు గణేశ్ నిమజ్జనాలతో సందడిగా మారాయి. సమిశ్రగూడెంలోని చెర్వు గట్టు వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ఉండ్రాజవరం: కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని తాడిపర్రు గ్రామంలో వినాయకుడి విగ్రహం ఊరేగింపు ఆదివారం వైభవంగా జరిగింది. వివిధ వేషధారణలు, వాయిద్యాల మధ్య అలంకరించిన ప్రత్యేక వాహనంలో స్వామి వారిని ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు సూలాలు ధరించి మొక్కులు చెల్లించుకున్నారు.

మండలంలో కె.సావరం గ్రామంలో వరసిద్ధి కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడిని రూ.10 లక్షల కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే సూర్యారావుపాలెంలో కమ్మ యువజన సంఘం ఆధ్వర్యంలోను, వినాయక భక్త సంఘం ఆధ్వర్యంలో ఉండ్రాజవరం గ్రామంలోని నిమ్మతోటలోను వివిధ రకాల పిండి వంటలతో అన్న సమారాధనలు నిర్వహించారు.


నిడదవోలులో నిమజ్జనానికి వాహనాల పై వేచి ఉన్న విగ్రహాలు


తాళ్లపూడి మండలం ప్రక్కిలంక వద్ద గోదావరిలో గణేశ్ నిమజ్జనం

విద్యుత్ శాఖ ఇంజినీర్ల సేవలు భేష్


కొవ్వూరులో విద్యుత్ శాఖ ఏడీఈ, ఏఈలను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు


పెరవలిలో ఇంజినీర్లను సన్మానించిన లయన్స్ క్లబ్ పెరవలి శాఖ సభ్యులు

కొవ్వూరు: విద్యుత్ శాఖ ఇంజినీర్లు నిరంతరం ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ అధ్యక్షుడు మద్దిపాటి వీర వెంకట సత్యనారాయణ పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ కొవ్వూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా ఇంజినీర్స్ డే నిర్వహించారు. ప్రఖ్యాత ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ట్రాన్స్‌కో ఏడీఈ పి.అచ్యుతాచారి మాట్లాడుతూ ఏమిటి అన్న విషయాన్ని సైన్స్ చెబితే, అది ఎలా చేయాలనేది ఇంజినీర్ చెబుతాడన్నారు. విశ్వ విఖ్యాత సివిల్ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను బ్రిటిష్ గుర్తించి ప్రభుత్వం ఆయనకు 'సర్ ' అనే బిరుదు ప్రదానం చేసిందన్నారు. అటువంటి మహనీయుడి జయంతిని ఇంజినీర్స్ డేగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. లయన్స్ క్లబ్ తరఫున ట్రాన్స్‌కో ఏఈడీ అచ్యుతాచారి, పట్టణ ఏఈ పి.జగదీశ్వరరావు, రూరల్ ఏఈ సీహెచ్ శ్రీనివాసరావులను శాలువాలు, పూలమాలలు వేసి సత్కరించి స్వీట్లు పంచారు. లయన్స్ క్లబ్ సభ్యులు కలగర వెంకట్రావు, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, యనమదల వెంకట సుబ్రహ్మణ్యం, ముళ్లపూడి కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పెరవలిలో..

పెరవలి: ఇంజినీర్ల దినోత్సవం సందర్భంగా ఆదివారం లయన్స్ క్లబ్ పెరవలి శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ శాఖల ఇంజినీర్లను సన్మానించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ వారిని సత్కరించారు. పంచాయతీరాజ్ ఏఈ ఏడుకొండలు, హౌసింగ్ ఏఈ విక్టర్ బాబు, ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావు, వివిధ గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సన్మాన గ్రహీతల్లో ఉన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పెరవలి శాఖ అధ్యక్షుడు కోలా సీతయ్యనాయుడు, బాబూజీరావు, సలాది ఉదయభాస్కరరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆపన్నుల సేవకు తామున్నామంటూ..

గోపాలపురం: వైఎస్సార్ సీపీ మండలంలోని వేళ్లచింతలగూడెం సీనియర్ నాయకుడు పిన్నమనేని చినబాబు యూత్ సభ్యులు ఆదివారం విజయవాడ వరద బాధితులకు దుస్తులు అందజేశారు. సుమారు 25 వేల విలువైన దుప్పట్లు, టవల్స్, చీరలను వరద బాధితులకు అందజేశారు. విజయవాడ మారుమూల ప్రాంతాల్లో ఇబ్బందులు పడుతున్న వారికి అందజేసినట్టు కమిటీ సభ్యులు కొరపాటి విద్యాసాగర్, పి.వెంకటేశు,మరపట్ల రాము, కొలూరి ప్రసాద్ పేర్కొన్నారు.


వేళ్లచింతలగూడెం నుంచి దుప్పట్లు తరలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

టీడీపీ బ్రాహ్మణగూడెం గ్రామశాఖ ఆధ్వర్యంలో..

చాగల్లు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండలంలోని తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణగూడెం గ్రామ శాఖ నాయకులు, కార్యకర్తలు రూ.101,116 విరాళంగా సమకూర్చారు. ఈ సొమ్మును సీఎం సహాయ నిధికి అందజేయవలసిందిగా కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు ఆదివారం వారు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, గారపాటి, బాబురావు, దొమ్మేటి వేణు, పత్తిపాటి సుబ్బారావు, శ్రీని చంటి, పాల్గొన్నారు.

కొవ్వూరు నియోజకవర్గం నుంచి..

కొవ్వూరు: విజయవాడ వరద బాధితుల కోసం నియోజకవర్గ వ్యాప్తంగా దాతలు భారీగా విరాళాలు అందిస్తున్నారు. తాళ్లపూడికి చెందిన నామా కొండబాబు బ్రదర్స్ రూ.70 వేలు సమకూర్చారు. చెన్నా శ్రీనివాసరావు, యండపల్లి శేఖర్, సిద్ధన రాధాకృష్ణ, తిరుమలశెట్టి సత్యనారాయణ, గర్రె ఈశ్వరుడు, కరిబండి వీరబాబులు ఒక్కొక్కరు రూ.5 వేల చొప్పున అందించారు. ఈ మొత్తం రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు ఆదివారం అందజేశారు. అలాగే మలకపల్లి గ్రామం నుంచి రూ.2.30 లక్షలు, కొవ్వూరు మూడో వార్డు నుంచి రూ.4వేలు, కాపవరం నుంచి రూ.25 వేలు, ధర్మవరానికి చెందిన కుందుల సూర్యారావు రూ.50వేలు విరాళంగా అందించారు. అలాగే ఆరికిరేవుల నుంచి రూ.1,11,111లు, అన్నదేవరపేట నుంచి రూ.90వేలు, బల్లిపాడు నుంచి రూ.1లక్ష, పోచవరం నుంచి రూ.90 వేలు, బ్రాహ్మణగూడెం నుంచి రూ.1,01,116, బీజేపీ నాయకుడు పిల్లలమర్రి మురళీకృష్ణ రూ.10 వేలు ఎమ్మెల్యే వెంకటేశ్వరరావుకు విరాళాలుగా అందజేశారు.

సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ సేవలు అభినందనీయం

- ఘనంగా వీడ్కోలు పలికిన డివిజన్‌లోని రెవెన్యూ అధికారులు
- పార్వతీపురం ఐటీడీఏ పీవోగా బదిలీ

కొవ్వూరు: దిగువ స్థాయి ఉద్యోగులతో స్నేహభావంతో మెలగుతూ, ఒత్తిడి లేకుండా వారితో పనులు చేయించుకోవడంలో సబ్‌కలెక్టర్‌గా అశుతోష్ శ్రీవాస్తవ సఫలీకృతులయ్యారని పలు వురు వక్తలు పేర్కొన్నారు. అశుతోష్ శ్రీవాస్తవ పార్వతీపురం ఐటీడీఏ పీవోగా బదిలీ అయ్యారు. దీంతో శనివారం రాత్రి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయనకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ ఐఏఎస్ అధికారి అయినప్పటికీ ఏనాడూ కిందిస్థాయి ఉద్యోగుల పట్ల అధికార దర్పం చూపలేదన్నారు. అం దరినీ సమన్వయ పరుచుకుంటూ పని చేశారన్నారు. అసెంబ్లీ ఎన్నికల అధికారిగా సమర్థవంతంగా పని చేశారన్నారు. ఇక్కడ విధుల్లో చేరిన తొలినాళ్లలో తాను వృతిపరంగాను, కుటుంబ పరంగానూ ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నానని అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. డివిజన్‌లోని తహసీల్దార్లు, కార్యాలయ సిబ్బంది అందించిన తోడ్పాటుతో సమర్థవంతంగా పని చేయగలిగానన్నారు. ఇన్‌చార్జ్ ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్ మాట్లాడుతూ మొదట్లో లాంగ్వేజ్ సమస్య వల్ల తనతో ఎంతో సన్నిహితంగా ఉండేవారన్నారు. ఎంతో పట్టుబట్టి తెలుగు నేర్చుకున్నారని కొనియాడారు. అనంతరం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ దంపతులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో కె.జవహర్ బాజీ, డీటీలు కె.రవి విక్రమ్, ప్రశాంతి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.అజయ్‌బాబు, డివిజన్‌లోని తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


కొవ్వూరులో సబ్ కలెక్టర్‌ను సత్కరిస్తున్న డివిజన్‌లోని తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు

1,008 మందితో చాలీసా పారాయణ

చాగల్లు: గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా చాగల్లు తెలగా సంఘం వినాయకుడి గుడి వద్ద ఆదివారం హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. వేద పండితుడు లింగాల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో 1008 మంది చిన్నారులు, మహిళలు పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో శ్రీలక్ష్మీగణపతి హోమం జరిగింది. మాజీ సర్పంచ్ గండ్రోతు సురేంద్రకుమార్, జుట్టా కొండలరావు తెలగా సంఘ పెద్దలు పాల్గొన్నారు. అలాగే చాగల్లు వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్ర వేడుకల వద్ద వేద పండితులచే శ్రీ లక్ష్మీ గణపతి హోమం చేశారు. చవితి వేడుకల ముగింపు సందర్భంగా మండలంలోని చిక్కాల, మార్కొండపాడు తదితర గ్రామాల్లో ప్రతిష్ఠించిన స్వామివారి విగ్రహాలను గ్రామ వీధుల్లో ఊరేగించారు. విచిత్ర వేషధారణలు, బ్యాండు మేళాలు, నృత్య ప్రదర్శనలతో ఊరేగింపు అట్టహాసంగా సాగింది.

అన్న సమారాధనలు

గణపతి ఉత్సవాల ముగింపు సందర్భంగా బ్రాహ్మణగూడెం నడి వీధిలోని వినాయకుని ఆలయం వద్ద ఆదివారం అన్న సమారాధన చేశారు. స్థానికులతో పాటు గరప్పాడు, ఎస్.ముప్పవరం తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. చంద్రవరం వినాయకుడి ఆలయం వద్ద కూడా అన్న సమారాధన చేశారు.


చాగల్లు వర్తక సంఘం కళావేదిక సినీ గీతాలు ఆలపిస్తున్న గాయక, గాయనీమణులు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా చాగల్లు వర్తక సంఘం కళావేదికపై శనివారం రాత్రి ప్రదర్శించిన సత్య ఆర్కెస్ట్రా వారి సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయక, గాయనీమణులు ఆలపించిన కొత్త, పాత, మధురగీతాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇక స్థానిక తెలగా సంఘం కళావేదికపై సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేటకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు కప్పగంతుల శ్రీరామచంద్రమూర్తి ఇంటో చోరీ జరిగింది. తాళ్లపూడి ఎస్సై కె.రామకృష్ణ కథనం ప్రకారం తన కుమార్తె వివాహం నిమిత్తం శ్రీరామచంద్రమూర్తి ఈ నెల 1న విజయవాడ వెళ్లారు. ఆదివారం తిరిగి వచ్చిన శ్రీరామచంద్రమూర్తి తన ఇంట్లో చోరీ జరిగినట్టు గుర్తించారు. తాళం పగలగొట్టి, ఇంట్లోని వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి. దీంతో ఆయన తాళ్లపూడి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. క్లూస్ టీం కూడా వచ్చి వివరాలు సేకరించినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఇంట్లో వెండి ఆభరణాలు, నగదు ఉన్నట్టు బాధితులు చెబుతున్నారు. ఎంత అనేది తేలాల్సి ఉందని ఎస్సై రామకృష్ణ తెలిపారు.


అన్నదేవరపేటలో చోరీ జరిగిన ఇంట్లో వివరాలు సేకరిస్తున్న ఎస్సై రామకృష్ణ, సిబ్బంది

కోటసత్తెమ్మకు విశేష పూజలు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అప్పారావుశర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారి దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల విక్రయం ద్వారా రూ.1,04,249 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్యప్రకాశ్ తెలిపారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

చాగల్లు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.సుందర్ బాబు అన్నారు. ఆదివారం చాగల్లులో సీతారాం ఏచూరి సంతాప సభ గారపాటి వెంకట సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ముందుగా శాఖా కార్యదర్శి కేకే దుర్గారావు ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుందరబాబు మాట్లాడుతూ సీతారాం ఏచూరి ప్రతిక్షణం కార్మిక, కర్షక సమస్యల మీద పోరాటం చేస్తూ ఉండేవారన్నారు. జుట్టా కృష్ణమూర్తి, ఎస్కే ఆదామ్, కె.తాతారావు, కొండయ్య, పల్లయ్య, కంకటాల బుద్ధుడు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి


ముదునూరి సత్యవతి

ఉండ్రాజవరం: మండలంలోని వెలగదుర్రు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు ముదునూరి సత్యవతి (105) ఆదివారం మృతి చెందారు. ఈమె 1919 లో జన్మించినట్టు కుటుంబు సభ్యుడు శేఖర్‌రాజు తెలిపారు. ఈమెకు కుమారులు, కుమార్తెలు, మనుమలు, ముని మనుములు ఉన్నారు.

యాగాల ఆహ్వాన బ్రోచర్ ఆవిష్కరణ


పాలంగి గ్రామంలో యాగాల బ్రోచర్ ఆవిష్కరణ సభలో ప్రసంగిస్తున్న మంత్రి దుర్గేష్

ఉండ్రాజవరం: లోక కల్యాణార్థం నిర్వహించే యాగాల వలన సనాతన వైదిక ధర్మం పునరుద్ధరింపబడుతుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మండలంలోని పాలంగి గ్రామంలో నవంబర్ 1 నుంచి నిర్వహించే యాగాల నిర్వహణ అహ్వాన (బుక్‌లెట్) బ్రోచర్‌ను ఆదివారం ఆ గ్రామంలో మంత్రి విడుదల చేశారు. శంకరాచార్య విజయేంద్ర సరస్వతీ స్వామి అనుగ్రహంతో ఉమారామలింగేశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో పాలంగి గ్రామంలో నవంబర్ 1 నుంచి 15 వరకూ మహా యాగాలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు వివరించారు. కార్యక్రమంలో ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్, ముళ్లపూడి రేణుక, పాలంగి సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, కె.సావరం సర్పంచ్ నార్ని రామకృష్ణ పాల్గొన్నారు.